నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
10 | ఖమ్మం, బుధవారం 19 మార్చి 2025 | BHADRADRI KOTHAGUDEM

పల్లె వనాలు కనుమరుగు

బీఆర్ఎస్ హయాంలో 'పల్లె ప్రకృతి వనాలు' ఎంతో ఆహ్లాదాన్ని పంచాయి. రకరకాల పూలు, పండ్లు, నీడనిచ్చే చెట్లతో పచ్చగా కళకళలాడుతూ కనిపించాయి. పల్లె ప్రజలు కూడా పట్టణ ప్రజల మాదిరి పార్కుల్లో ఉదయం, సాయంత్రం సంతోషంగా గడిపారు. నిర్వహణకు కేసీఆర్ సర్కార్ నిధులు సకాలంలో ఇవ్వడంతో పంచాయతీ సిబ్బంది సైతం వాటిని కంటి కిరెప్పలా కాపాడారు. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది.. పల్లె ప్రకృతి వనాలు ఎండిపోయి కళాహీనంగా ఆనవాళ్లు లేకుండా కనిపిస్తున్నాయి. అధికారులు వనాల నిర్వహణను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. బోనకల్లు మండలం రావినూతల గ్రామంలో పల్లె ప్రకృతి వనాన్ని ఏకంగా నామరూపాలు లేకుండా చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులే ఉద్దేశపూర్వకంగా బీఆర్ఎస్‌పై అక్కసుతో పాఠశాలలో ఉన్న వనాన్ని పూర్తిగా తొలగించారు. రూ.లక్షల ప్రజాధనం వృథా అవుతున్నా అధికారులు స్పందించకపోవడంపై కాంగ్రెస్ పాలనపై పల్లె ప్రజలు మండిపడుతున్నారు.
– బోనకల్లు/ పెనుబల్లి/ రఘునాథపాలెం, మార్చి 18

- రావినూతల గ్రామంలో పూర్తిగా మాయం
- నాడు ప్రభుత్వ పాఠశాలలో ఆహ్లాదాన్ని పంచిన ప్రకృతి వనం
- రూ.లక్షల ప్రజాధనం వృథా.. పట్టించుకోని అధికారులు
- జిల్లాలో అన్నిచోట్ల ఆనవాళ్లు కోల్పోయిన 'పల్లె ప్రకృతి వనాలు'
- నిర్వహణకు నిధులు ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాడు కళకళలాడుతున్న రావినూతల పల్లె ప్రకృతి వనం

నేడు పూర్తిగా కనుమరుగైన పల్లె ప్రకృతి వనం

గ్రామాల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు ఆనాటి కేసీఆర్ ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలను(పార్కులు) ఏర్పాటు చేసింది. కానీ.. నేటి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఆ వనాలు ఎండిపోయి కనిపిస్తున్నాయి. ఖమ్మం జిల్లా బోనకల్లు మండలం రావినూతల గ్రామంలో పల్లె ప్రకృతి వనం ఏకంగా కనుమరుగైంది. ఆనాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఖాళీ ప్రదేశంలో పల్లె ప్రకృతి వనం ఏర్పాటు చేసేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు నాటి సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్ గ్రామ పంచాయతీలో తీర్మానం చేశారు. ఈ మేరకు అధికారులు పాఠశాల ఆవరణలో పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మొక్కలు నాటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా 5లక్షల 9వేల 327 రూపాయలు ఖర్చుపెట్టి ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. దాతల సహకారంతో జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని సైతం నెలకొల్పారు. ఈ వనంలో రకరకాల పూల మొక్కలు, ఆకర్షణీయమైన చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ ప్రకృతి వనాన్ని కంటి కిరెప్పలా కాపాడుకున్నారు. కానీ.. ఏమైందో ఏమో ప్రస్తుతం ప్రకృతివనంలో ఉన్న మొక్కలు, చెట్లను పూర్తిగా తొలగించారు. పచ్చని మొక్కలతో కళకళలాడిన ప్రకృతివనం నేడు పూర్తిగా కనుమరుగైపోయింది.

పెనుబల్లిలో బోసిపోయిన పల్లె ప్రకృతి వనం

అధ్వానంగా పెనుబల్లి వనం..

పెనుబల్లి మండల కేంద్రంలోని మసీదు పక్కన ఉన్న పల్లె ప్రకృతి వనంలో నాడు ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది. సుదూర ప్రాంతం నుంచి ఎన్నో రకాల పండ్ల మొక్కలు, పూల మొక్కలు, నీడనిచ్చే మొక్కలు తీసుకొచ్చి పంచాయతీ సిబ్బంది ఎంతో బాధ్యతగా పెంచారు. జామ, సపోట, లవంగం, చెక్క, బాదం చెట్లతోపాటు పలు రకాల పూల మొక్కలకు ఉదయం, సాయంత్రం నీళ్లు పోస్తూ ఎప్పటికప్పుడు వనాన్ని శుభ్రం చేసేవారు. పరిసర ప్రాంతాల చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రకృతి వనంలో ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తూ ఉండేవారు. కానీ.. ప్రభుత్వం మారిన తర్వాత ఎవ్వరు కూడా అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో మొక్కలన్నింటినీ జంతువులు ధ్వంసం చేశాయి. ఆలనాపాలనా లేక పల్లె ప్రకృతి వనం ప్రస్తుతం అధ్వానంగా తయారైంది.


ఆనవాళ్లు లేకుండా పోయిన రఘునాథపాలెం పల్లె ప్రకృతి వనం

ఆనవాళ్లు లేని రఘునాథపాలెం వనం

మండల కేంద్రం రఘునాథపాలెం మోడల్ కాలనీలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. లక్షలు ఖర్చు చేసి వేసిన మొక్కలు ప్రస్తుతం ఎండిపోయాయి. వనం పనికిరాకుండా పోయింది. కేవలం బోర్డులు, కట్టిన గోడలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. ఒకప్పుడు అందమైన పూలమొక్కలతో స్థానికులకు ఆహ్లాదాన్ని పంచిన ఈ వనంలోని చెట్లను ఇష్టానుసారంగా నరికివేశారు. నర్సరీలోని బల్లాలు, రోడ్లు కనిపించడం లేదు. ప్రధాన గేటు ధ్వంసమైంది. బయటి శిలాఫలకం కానరాకుండా చేశారు. పక్కనే పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఆట వస్తువులు, జిమ్ పరికరాలు విరిగిపోయి కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ నాయకులే కావాలని పల్లె ప్రకృతి వనం ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారని గ్రామస్తులు కొందరు ఆరోపిస్తున్నారు. వనంలోని చెట్లన్నింటినీ జేసీబీ సహాయంతో తొలగించారని, శిలాఫలకాన్ని మాయం చేశారని చెబుతున్నారు. కలెక్టర్ దృష్టి సారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పూర్తిస్థాయిలో విచారణ చేస్తాం..

రావినూతల పాఠశాలలో పల్లె ప్రకృతి వనం ఉన్నట్లు నాకు తెలియదు. పల్లె ప్రకృతి వనాన్ని తీసివేయాలన్నా.. ఉంచాలన్నా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్ణయం జరగాలి. పల్లె ప్రకృతి వనాన్ని తొలగించడంపై పూర్తిస్థాయిలో విచారించి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తాం.
– రమాదేవి, ఎంపీడీవో, బోనకల్లు

కాంగ్రెస్ నాయకులే తొలగించారు..

రావినూతల పాఠశాలలో ఉన్న పల్లె ప్రకృతి వనాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులే దగ్గరుండి మరీ తొలగించేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ జ్ఞాపకాలను చెరిపేసేందుకు అక్కసుతో వారు ఈ పనిచేశారు. రూ.లక్షలు ఖర్చుపెట్టి ఏర్పాటు చేసిన ప్రకృతి వనాన్ని తొలగించిన వారిపై అధికారులకు ఫిర్యాదు చేశాను. కానీ.. ఇంతవరకు వారు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.
– కొమ్మినేని ఉపేంద్ర, మాజీ సర్పంచ్, రావినూతల, బోనకల్లు

ప్రకృతి వనాలను కాపాడాలి..

ప్రజలకు ఆహ్లాకరమైన వాతావరణాన్ని అందించేందుకు నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలను నిర్మించింది. నిర్వహణ బాధ్యతను సర్పంచ్‌లకు అప్పగించింది. సుదూర ప్రాంతాల నుంచి మొక్కలు తెచ్చి ప్రకృతి వనం సృష్టించాం. కానీ.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ మొక్కలకు నీళ్లు పోయలేక ఎండబెడుతున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకొని పల్లె ప్రకృతి వనాలను కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.
– తేజావత్ తావునాయక్, మాజీ సర్పంచ్, పెనుబల్లి

'యువతులకు స్కూటీలు' హామీ ఏమైంది?

'మండలి'లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీల నిరసన.. పాల్గొన్న తాతా మధు..

శాసనమండలి ఎదుట నమూనా స్కూటీతో నిరసన వ్యక్తం చేస్తున్న తాతా మధు

ఖమ్మం, మార్చి 18: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఇచ్చిన 'యువతులకు స్కూటీ' హామీ ఏమైందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ప్రశ్నించారు. ఈ మేరకు అసెంబ్లీ సమావేశాల సందర్భంగా హైదరాబాద్‌లో మంగళవారం శాసనమండలి ఎదుట స్కూటీల నమూనాలను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు 18 ఏళ్లు పైబడిన విద్యార్థినులు, యువతులకు వెంటనే స్కూటీలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంకాగాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

పోడు వ్యవసాయానికి విద్యుత్ లైన్ల ఏర్పాటు

- విద్యార్థులకు ప్రకృతి పట్ల అవగాహన కల్పించాలి
- ప్రజలకు ఉపయోగపడే మొక్కలు నాటాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జితేశ్ వి పాటిల్

వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 18 (నమస్తే తెలంగాణ) : జిల్లావ్యాప్తంగా పోడు వ్యవసాయం చేసే రైతులకు నీటి సౌకర్యం కోసం విద్యుత్ లైన్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని పోడు వ్యవసాయానికి విద్యుద్దీకరణ, ఉపాధిహామీ పనుల పురోగతి, తాగునీటి సంరక్షణ చర్యలు, మొక్కల పెంపకం, ఇంకుడుగుంతల తవ్వకాలు, మీ సేవా దరఖాస్తులు, ధరణి, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోడు పట్టాలు పొందిన రైతులు వ్యవసాయం చేయడానికి విద్యుత్ లైన్ల ఏర్పాటుకు అటవీశాఖ అధికారులు, పంచాయతీ సెక్రటరీలు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలన్నారు. విద్యుత్ లైన్ల ఏర్పాటు సాధ్యంకాని ప్రదేశాల్లో అటవీశాఖ అధికారుల ఆమోదంతో బావులు తవ్వి సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు ద్వారా నీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. పోడు భూముల్లో ఆయిల్‌పాం సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని, ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. బతుకమ్మ పండుగలో పూజకు ఉపయోగించే తంగేడు పూలు ఎక్కడా కనపడటం లేదని, ప్రజలకు ఉపయోగపడే మొక్కలను నాటాలని సూచించారు. అదనపు కలెక్టర్ విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, అడిషనల్ డీపీఆర్‌వో రవి, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, మహిళా శిశు సంక్షేమాధికారి స్వర్ణలత లెనీనా, డీఈవో వెంకటేశ్వరాచారి పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ప్రైవేటు ఆస్పత్రుల తనిఖీలో భద్రాద్రి డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్

ప్రైవేటు ఆస్పత్రిలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మార్చి 18 : ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భద్రాద్రి డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్ హెచ్చరించారు. కొత్తగూడెంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ధరల పట్టికను ప్రదర్శించాలని, పనిచేసే వైద్యుల సర్టిఫికెట్లను ఫైల్ చేయాలని సూచించారు. ఆయుష్ ఆస్పత్రులన్నీ(ఆయుర్వేద, యునాని, హోమియో), ఫిజియోథెరపిస్టులు కూడా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు కింద రిజిస్ట్రేషన్ చేయించాలని కోరారు. తనిఖీల్లో ఆయన వెంట డీవైడెమో ఫయాజ్ మొహియుద్దీన్, పాయం శ్రీను, డీవై పీఎంవోలు ఉన్నారు.

కేయూ వీసీని సస్పెండ్ చేయాలని ధర్నా

డిగ్రీ 1, 3, 5 సెమిస్టర్ల ఫలితాలు విడుదల చేయాలని డిమాండ్

ఖమ్మం అర్బన్, మార్చి 18: విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులు ఖమ్మం కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు రామకృష్ణ, జార్జిరెడ్డి, సురేశ్, మస్తాన్‌లు మాట్లాడుతూ కళాశాలలు బకాయిలు చెల్లించలేదనే సాకుతో డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ ఫలితాలు నిలిపివేశారని తెలిపారు. దీంతో విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని, దీనికి కారణమైన వీసీని వెంటనే సస్పెండ్ చేసి.. ఫలితాలు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

రోజువారీ వేతన కార్మికుల ధర్నా

అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

గిరిజన సంక్షేమ హాస్టల్ ఎదుట ధర్నా చేస్తున్న డైలీ వేజ్ వర్కర్లు

తిరుమలాయపాలెం, మార్చి 18: అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని, జీవో 68ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ హాస్టళ్లలో పని చేస్తున్న రోజువారీ కార్మికులు మండల కేంద్రంలోని హాస్టల్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ రోజువారీ వేతన కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తున్నదని ఆరోపించారు. కార్మికులకు పనికి తగ్గట్టుగా వేతనాలు పెంచాల్సిందిపోయి.. తగ్గించాలని చూడడం అన్యాయమన్నారు. వేతనాలు తగ్గించేందుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో 68ని వెంటనే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, తుళ్లూరి నాగేశ్వరరావు, అరుణ, కమల, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లక్షలే లక్ష్యం!

- కేఎంసీలో నూరు శాతం వసూళ్ల కోసం బీసీలు, డబ్ల్యూవోలకు వ్యక్తిగత టార్గెట్లు
- ఆ మేరకు వసూలు చేయకపోతే వేతనం కట్ చేస్తామంటున్న అధికారులు
- ఒక్కొక్కరికీ రూ.లక్ష నుంచి రూ.2.50 లక్షల వరకూ రోజువారీ లక్ష్యాలు
- ప్రజలు పన్నులు చెల్లించకపోతే తామెలా బాధ్యులమవుతామంటున్న బీసీలు
- ఇలాగే వేధిస్తే మూకుమ్మడి సెలవులు పెడతామంటూ హెచ్చరిస్తున్న బిల్ కలెక్టర్లు
- కేఎంసీ కమిషనర్ చాంబర్ ఎదుట ధర్నా.. అసిస్టెంట్ కమిషనర్‌తో వాగ్వాదం

కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌తో వాగ్వాదానికి దిగిన బిల్ కలెక్టర్లు

ఖమ్మం, మార్చి 18 : ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్(కేఎంసీ)లో వివిధ రకాల పన్నుల వసూలు విషయం వివాదాలకు, వాగ్వాదాలకు దారితీస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనైనా ప్రజల నుంచి పన్నులు వసూలు చేయాల్సిందేనంటూ కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో వారంతా కలిసి కిందిస్థాయి సిబ్బందికి టార్గెట్లు పెడుతున్నారు. చివరికి ఆ లక్ష్యాలను చేరలేకపోతే వేతనాలు కూడా కట్ చేస్తామంటూ స్పష్టం చేస్తున్నారు. దీంతో పన్నుల వసూళ్లకు వెళ్లే క్షేత్రస్థాయి సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి పన్నులు చెల్లించకపోతే తామెలా బాధ్యులమవుతామని, ప్రజల నుంచి పన్నులను తామెలా బలవంతంగా వసూలు చేయగలమని ప్రశ్నలు సంధిస్తున్నారు. ప్రజలు పన్నులు చెల్లించని కారణంగా తమ వేతనాల్లో కోత విధిస్తే తమ కుటుంబాలను ఎలా పోషించువాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే వేధిస్తే తాము మూకుమ్మడి సెలవు పెట్టి వెళ్లిపోతామని, కూలి పనులైనా చేసుకొని జీవిస్తామని స్పష్టం చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం ఉదయం 8 గంటలకు కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఇదే విషయమై ఏసీతో వాగ్వాదానికి దిగారు.

కేఎంసీలో 60 డివిజన్లు ఉన్నాయి. వీటిల్లోని 80,272 అసెస్‌మెంట్ల కింద ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.36.74 కోట్ల ఇంటి పన్నులను పన్నులు చేయాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం విధించింది. అలాగే 35,648 పంపు కనెక్షన్లకు గాను రూ.16.80 కోట్ల పంపు బిల్లులను వసూలు చేయాలని టార్గెట్ పెట్టింది. ఈ పన్నుల వసూళ్ల కోసం 25 బిల్ కలెక్టర్ల (బీసీ)ను, 18 మంది వార్డు ఆఫీసర్ల (డబ్ల్యూవో)ను కేఎంసీ ఉన్నతాధికారులు నియమించారు. వారికి ఆయా డివిజన్లను కేటాయించారు. అలాగే ఈ పన్నుల విసూళ్ల కోసం నగరంలో 12 చోట్ల ప్రత్యేక కౌంటర్లు కూడా ఏర్పాటు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సోమవారం (2025 మార్చి 17) నాటికి రూ.36.74 కోట్ల ఇంటి పన్నుల వసూళ్ల లక్ష్యంలో రూ.24.60 కోట్లను వసూలు చేశారు. ఇంకా రూ.12.14 కోట్లను వసూలు చేయాల్సి ఉంది. ఇక రూ.16.80 కోట్ల పంపు బిల్లులకు గాను సోమవారం నాటికి రూ.6.10 కోట్లను మాత్రమే వసూలు చేశారు. ఇంకా రూ.10 .70 కోట్లను వసూలు చేయాల్సి ఉంది. ఈ రెండు పన్నులు కలిపి ఇంకా రూ.22.84 కోట్లు వసూలు కావాలి. అయితే, ఈ నెల 31న ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి నూరు శాతం పన్నులను వసూలు చేయాలని బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లకు కేఎంసీ ఉన్నతాధికారి టార్గెట్లు విధించారు. కమర్షియల్ ఏరియాల బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు ఒక్కొక్కరూ రోజుకు రూ.2 .50 లక్షలు, నాన్ కమర్షియల్ ఏరియాల బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు ఒక్కొక్కరూ రోజుకు రూ.లక్ష వరకూ వసూలు చేయాలని ఆదేశించారు. మార్చి 31 నాటికి ఈ లక్ష్యాలను చేరకపోతే వేతనాలు కట్ చేస్తామంటూ హెచ్చరించారు.

ఉదయాన్నే ధర్నా..

టార్గెట్ల పేరితో కేఎంసీ ఉన్నతాధికారి తమను వేధిస్తున్నారని, మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపిస్తూ బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు కలిసి మంగళవారం ఉదయం 8 గంటలకే కేఎంసీలోని కమిషనర్ చాంబర్ ఎదుట ధర్నా నిర్వహించారు. పన్నుల వసూలులో తాము అశ్రద్ధ చేయడం లేదని అన్నారు. అయినప్పటికీ రోజుకు రూ.2.50 లక్షలు, రూ.లక్ష చొప్పున టార్గెట్లు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయంపై అసిస్టెంట్ కమిషనర్ షఫీఉల్లాను చుట్టుముట్టి ఆయనతో వాగ్వాదానికి దిగారు. ఇన్ని టార్గెట్ల మధ్య తాము విధులు నిర్వహించలేమని, మూకుమ్మడిగా సెలవులు పెట్టి వెళ్లిపోతామని స్పష్టం చేశారు. రోజూ ఉదయం 7 నుంచి రాత్రి 9 వరకూ పన్నుల వసూలు కోసం శ్రమిస్తున్నామని; మహిళా ఉద్యోగులు, చిన్న పిల్లలున్న తల్లులు కూడా రాత్రి 9 వరకు పనిచేస్తున్నారని అన్నారు. అయినప్పటికీ వ్యక్తిగత టార్గెట్లు పెడుతూ వేతనాలు కట్ చేస్తామంటే తాము విధులు నిర్వహించలేమని తేల్చిచెప్పారు.

వంద శాతం పన్నుల వసూళ్ల కోసమే..

కరీంనగర్, నిజామాబాద్ వంటి కార్పొరేషన్లలో ఇంటి పన్నులు, పంపు బిల్లులు కలిపి రోజుకు రూ.50 లక్షల వరకూ వసూలవుతుంటే కేఎంసీలో మాత్రం రోజుకు రూ.20 లక్షలు కూడా వసూలు కావడం లేదు. నూరు శాతం పన్నులు వసూలు చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయి. అందుకు అనుగుణంగానే పనిచేయాలని చెప్పాం. మౌఖికంగా ఆదేశించామే తప్ప మరేమీ లేదు. కేఎంసీ బిల్ కలెక్టర్లు కూడా వసూలు చేయగలుగుతారు. పనిచేయాలని చెప్పడం తప్పెలా అవుతుంది? **–అభిషేక్ అగస్త్య, కేఎంసీ కమిషనర్**

అర్హులకు ఓటు హక్కు కల్పించాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

మామిళ్లగూడెం, మార్చి 18 : జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని, అర్హులైన వారు ఓటు హక్కు తప్పక వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఓటరు జాబితా సవరణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా జరగాలని, ప్రజాస్వామ్య విలువలు నెలకొల్పేందుకు ఓటరు జాబితా చాలా ముఖ్యమన్నారు. ఓటరు జాబితా, పారదర్శకమైన పోలింగ్ సిబ్బంది, ఈవీఎం యంత్రాలు, బ్యాలెట్ పేపర్లు ఎన్నికల వ్యవస్థకు కీలకంగా పేర్కొన్నారు. ఓటరు జాబితాలో ఓటర్ల పేర్లు తొలగించే సమయంలో తప్పక నిర్దేశిత మార్గదర్శకాలు పాటించాలని సూచించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పోటీ చేసిన ఇద్దరు అభ్యర్థులు తమ వ్యయ వివరాలు నమోదు చేయలేదని పేర్కొన్నారు. జిల్లాలో 1,459 పోలింగ్ కేంద్రాలకు.. 5,824 బ్యాలెట్ యూనిట్లు, 2,202 కంట్రోల్ యూనిట్లు, 2,218 వీవీ ప్యాట్‌లు అందుబాటులో ఉన్నట్లు పార్టీల ప్రతినిధులకు ఆయన తెలియజేశారు. ఓటరు జాబితా సవరణపై సందేహాలు, ఫిర్యాదులు, సూచనలు ఉంటే వెంటనే తెలియజేయాలని సూచించారు. సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులు సీహెచ్.నాగేశ్వరరావు, జీ విద్యాసాగర్, ఎన్.నాగేశ్వరరావు, గోపాల్‌రావు, లింగనబోయిన సతీశ్, పీటీఆర్ కృష్ణప్రసాద్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీహెచ్.స్వామి, ఎన్నికల డీటీ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.